క్లుప్తంగా

31న స్పాట్ అడ్మిషన్లు

సింహాద్రిపురం : మండలంలోని నిడివెల్ల గ్రామ సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్లకు ఈనెల 31న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ తాతాజీ తెలిపారు. ఖాళీగా ఉన్న కోర్సులు సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్, కంప్యూటర్ కోర్సులలో ఖాళీగా ఉన్నాయని ఫీజు రూ.4,700 ఉంటుందని, చేరదలుచుకున్న విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈనెల 31న హాజరు కావాలన్నారు.

ఫ్యాక్షన్ గ్రామంలో ప్రత్యేక నిఘా


గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ వినోద్‌కుమార్

తొండూరు : రాజకీయ కక్షసాధింపునకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని డీఎస్పీ వినోద్ కుమార్ తెలిపారు. మండల పరిధిలోని భద్రంపల్లి గ్రామంలో డీఎస్పీ గురువారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయకులు గ్రామాన్ని సురక్షితంగా ఉంచాలిగాని నాశనం చేస్తే మాత్రం కఠినంగా శిక్షిస్తామన్నారు. కార్యక్రమంలో సీఐ బాల మద్దిలేటి, ఎస్ఐ లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాంక్ ఆఫ్ భరోడా సేవలను సద్వినియోగం చేసుకోండి

పులివెందుల రూరల్ : పట్టణంలోని పాతగంగిరెడ్డి ఆసుపత్రి సమీపంలో నూతనంగా నిర్మించిన బ్యాంక్ ఆఫ్ భరోడా బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకు మేనేజర్ శంకర్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బ్యాంక్ ఆఫ్ భరోడా బ్యాంకులో అతి తక్కువ వడ్డీతో గోల్డ్‌లోన్‌లు ఇస్తామన్నారు. అలాగే ఫిక్స్‌డ్ డిపాజిట్‌లపై అత్యధిక వడ్డీ రేట్లు వర్తింపజేస్తామన్నారు. సీనియర్ సిటిజన్‌లకు 0.5 అదనంగా వడ్డీలు వర్తిస్తాయన్నారు. హౌస్ లోన్‌కు సంబంధించి కూడా రుణాలు ఇస్తామన్నారు.

సెబ్ కార్యాలయంలో సిబ్బంది కొరత


స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కార్యాలయం

పులివెందుల రూరల్ : పట్టణంలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు సమీపంలో ఉన్న స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కార్యాలయంలో సిబ్బంది కొరత ఉంది. స్టేషన్‌లో ముగ్గురు హెడ్ కానిస్టేబుళ్లు ఉండాల్సి ఉండగా ఒకరు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. అతను కూడా సెలవులో వెళ్లారు. 7 మంది కానిస్టేబుల్స్ ఉండాలి.. కానీ ముగ్గురు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. సంబంధిత జిల్లా అధికారులు స్పందించి పులివెందుల సెబ్ కార్యాలయంలో సిబ్బంది కొరత లేకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మద్యం సేవించిన వ్యక్తికి జైలు శిక్ష, జరిమానా

చింతకొమ్మదిన్నె : టమటం పురుషోత్తంరెడ్డి ఈనెల 11వ తేదీ మద్యం సేవించి ద్విచక్రవాహనం నడిపినందుకు 15 రోజుల జైలు శిక్షతో పాటు రూ.2500 జరిమానా విధిస్తూ కడప ఫస్ట్ స్పెషల్ జ్యుడిషియల్ కోర్టు తీర్పునిచ్చినట్లు ఎస్ఐ శివశంకర్ నాయక్ తెలిపారు.

విద్యా సదస్సు జయప్రదం చేయండి

కడప ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 28న బాలాజీ నగర్‌లోని శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించబోయే రాష్ట్రస్థాయి విద్యాసదస్సును జయప్రదం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మి రాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు కోరారు. గురువారం కడప యూటీఎఫ్ కార్యాలయంలో సదస్సు కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూటీఎఫ్ ఆవిర్భవించి 50 సంవత్సరాలు పూర్తికావస్తున్న సందర్భంగా రాష్ట్రమంతటా స్వర్ణోత్సవాలు జరుగుతున్నాయన్నారు. ఇందులో భాగంగా జిల్లాలలో సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఏజాస్ అహ్మద్, ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, నాయకులు గోపీనాథ్, వీరనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బయోటెక్నాలజీలో డాక్టరేట్

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం బయోటెక్నాలజీ శాఖ పరిశోధకురాలు షేక్ సమీనకు వైవీయూ డాక్టరేట్ ప్రదానం చేసింది. బయోటెక్నాలజీ ప్రొఫెసర్ ఎ. చంద్రశేఖర్ పర్యవేక్షణలో 'నెక్స్ట్ జనరేషన్ సీక్వెన్సింగ్ పద్ధతిని ఉపయోగించి, కొర్రల దిగుబడిని పెంచేందుకు రికాంబినెంట్ ఇన్‌బ్రీడ్ లైన్స్'ని అభివృద్ధి చేశారు. ఈమె చేసిన పరిశోధనకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు వైవీయూ పరీక్షల నిర్వహణాధికారి ప్రొఫెసర్ ఈశ్వర్ రెడ్డి తెలిపారు.

కాలువలు ఇలా.. సాగునీరు పారేదెలా..?

- వర్షం రాకపోవడంతో సాగు చేసిన పంటలను దున్నేస్తున్న రైతులు
- మైలవరం దక్షిణ కాలువ పూడిపోవడంతోపాటు పేరిగిపోయిన పిచ్చిమొక్కలు
- వరుణుడి రాక కోసం ఎదురు చూస్తున్న అన్నదాతలు


పూడికలతో నిండి అధ్వానంగా ఉన్న మైలవరం దక్షిణ కాలువ


సాగు చేసిన మినుము పంటను దున్నేస్తున్న రైతు

ఎర్రగుంట్ల : మండల పరిధిలో ప్రధానంగా వ్యవసాయ ఆధారిత దక్షిణ మధ్య కాలువ ఉంది. ఈ కాలువ మైలవరం రిజర్వాయర్ నుంచి దక్షిణం వైపు జమ్మలమడుగు మండల పరిధిలోని సిరిగేపల్లి, సుంకేసుల గ్రామాలను కలుపుతు ఎర్రగుంట్ల మండల పరిధిలోని కలమల్ల, ఎర్రగుంట్ల పట్టణం మీదుగా కమలాపురం వరకు నీటి ప్రవాహం పోతుంది. ఈ కాలువ కింద లింక్ చానల్స్‌తో చెరువులు ఉన్నాయి. రైతులు ఈ కాలువపై ఆధారపడి పంటలు పండించుకుంటూ జీవిస్తున్నారు. ఈ లింక్ చానాల్ ద్వారా పోట్లదుర్తి, మాలెపాడు, ఇల్లూరు, చిన్నదండ్లూరు, ఎర్రగుంట్ల, హనుమనుగుత్తి, తిప్పలూరు గ్రామాలలో రైతులు పంటలు సాగు చేస్తుంటారు. అయితే ప్రస్తుతం ఈ కాలువ ఆర్టీపీపీ ఫ్లైయాష్ బూడిదతో పూడిపోవడం ద్వారా వర్షం నీరు, మైలవరం డ్యామ్ నుంచి వచ్చే నీటికి అడ్డంగా ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కాలువలో పిచ్చిచెట్లు విపరితంగా పెరిగిపోయి నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్నాయి. మేకలబాలయపల్లి గ్రామం వద్ద కాలవపై చిన్న వంతెను నిర్మించారు. ఈ వంతెన శిథిలావస్థకు చేరి కూలిపోయేలా ఉందని స్థానికులు అంటున్నారు. దీనికి మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

సాగు చేసిన పంటలను దున్నేస్తున్న రైతులు

వరుణుడు సకాలంలో కరుణిస్తాడని ఆశతో రైతులు మినుము పంటలను సాగు చేశారు. అయితే వర్షం రాకపోగా కాలువలో నీరు కూడా రాకపోవడంతో రైతులు సాగు చేసిన పంటలను దున్నేస్తున్నారు. మినుము పంట సాగుకు ఎకరాకు సుమారు రూ.10 వేలు ఖర్చు చేసినట్లు రైతులు తెలుపుతున్నారు. కౌలు రైతు పరిస్థితి మరీ దారుణంగా ఉంది. మైలవరం కాలువలోకి రిజర్వాయర్ నీరు సకాలంలో వస్తే దాని ద్వారా కాలువలోకి లింక్ ఉన్న పంట పోలాలకు నీరు అందించ వచ్చు. అయితే కాలువలు పూడి ఉండటంతో నీరు పారలేదని రైతులు అంటున్నారు. ఇలా ప్రతి ఏడాది రైతులు పంటల సాగుకు వేల రూపాయాలు ఖర్చు చేయడం తర్వాత దున్నేయడం వల్ల పూర్తిగా నష్ట పోతున్నారు. ఎర్రగుంట్ల పట్టణ పరిధిలో సుమారు 200 ఎకరాలలో మినుము పంటను రైతులు దున్నేశారు.


మైలవరం దక్షిణ కాలువపై కూలడానికి సిద్ధంగా ఉన్న వంతెన

వర్షం రాకపోవడంతో దున్నేస్తున్నాం



వరుణదేవుడు కరుణిస్తాడని ఆశతో మినుము పంటను సాగు చేశాం. అయితే ఇప్పటి వరకు వర్షం రాలేదు. మెలవరం కాలువ నుంచి నీరు రాలేదు. దీంతో చేసేది లేక సాగు చేసిన పంటను దున్నేస్తున్నాం. ప్రభుత్వం ఆదుకోవాలి. ఐదెకరాలలో మినుము పంటను సాగు చేశాను.

– శివరామిరెడ్డి, రైతు, ఎర్రగుంట్ల

30 ఎకరాలు మినుము పంటను దున్నేశాను



కౌలుకు 30 ఎకరాలు తీసుకుని మినుము పంటను సాగు చేశాను. ఎకరాకు రూ.10 వేలు ఖర్చు వచ్చింది. వర్షం రాలేదు. మైలవరం కాలువ నుంచి నీరు రాలేదు. చేసేది లేక పంటను దున్నేశాను. నాకు 30 ఎకరాలకు గాను సుమారు రూ.3 లక్షలు ఖర్చు వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి.

– రాధాకృష్ణ, కౌలురైతు, ఎర్రగుంట్ల

పూడికలు తీసేందుకు నివేదికలు పంపించాం

మైలవరం దక్షిణ కాలువ పూడికలు తీసేందుకు సర్వే చేసి నివేదికలు ప్రభుత్వానికి పంపించాం. త్వరలోనే కాలువలో పూడిక తీత పనులు చేపట్టి రైతులకు నీరు అందించేలా చూస్తాం

– రంగనాథ్, డీఈ, మైలవరం దక్షిణ కాలువ ఇరిగేషన్, ఎర్రగుంట్ల

నేడు డయల్ యువర్ డీఎం

పులివెందుల రూరల్ : స్థానిక ఆర్టీసీ డిపోలో ప్రయాణికులకు ప్రయాణంలో ఏవైనా సమస్యలు ఉంటే వాటిని తెలుసుకునేందుకే డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు 9959225780కు ప్రయాణికులు తమ సమస్యలను చెప్పవచ్చునన్నారు. అలాగే వాట్సప్ ద్వారా కూడా తమ సమస్యలను మెసేజ్ రూపంలో తెలుపవచ్చునన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

28న మెగా వైద్య శిబిరం

జమ్మలమడుగు : పట్టణంలోని దేవగుడి శంకర్ రెడ్డి, సుబ్బరామిరెడ్డి ట్రస్టు ద్వారా ఈనెల 28వ తేదీ ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు టీడీపీ, బీజేపీ కార్యాలయ కార్యదర్శులు తెలిపారు. ఈ శిబిరాన్ని ముద్దనూరు రహదారిలో ఉన్న రిపబ్లిక్ క్లబ్బులో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

31న పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లు

కమలాపురం : స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 31వ తేదీన స్పాట్ అడ్మిషన్లు జరగనున్నాయని ప్రిన్సిపాల్ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్ క్లాస్ పాస్ అయిన విద్యార్థులందరికి ఈ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశం పొందడానికి ఈ ప్రక్రియ సువర్ణ అవకాశం అని ఆయన తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని స ద్వినియోగం చేసుకుని టెన్త్ లేదా తత్సమానమై న పరీక్షలు ఉత్తీర్ణులైన తమ పిల్లలను ఈ కళాశాలలో చేర్పించి వారి భవితకు నాంది పలకాలన్నారు.

ఫసల్ బీమాను పాత పద్ధతిలో అమలు చేయాలి

వేంపల్లె : రైతులు సాగుచేస్తున్న తమ పంటలకు పీఎం ఫసల్ బీమా పథకాన్ని పాత పద్ధతిలో అమలు చేయాలని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి మస్తాన్‌రెడ్డి కోరారు. గురువారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం వివిధ హామీలు ప్రకటించిందని, అందులో ఫసల్ బీమాను పాత పద్ధతిలో అమలు చేస్తామని, ఇన్సూరెన్స్ ఏర్పాటు చేస్తామని చెప్పినట్లు వివరించారు. రైతులు బ్యాంకులో రెన్యువల్ చేసుకున్న వారికి ఫసల్ బీమా కింద జూలై 31లోగా ప్రీమియం చెల్లించేవారన్నారు. ఆగస్టు 15వ తేదీలోపు వర్షాలు రాకపోతే పంట పెట్టకపోతే పీఎం ఫసల్ బీమా కింద రూ. 8,250 చొప్పున మంజూరు అవుతుండేదన్నా రు. ఆ విధంగా పాత పద్ధతిలో అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థుల మనో వికాసం పెంపొందించాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ అనురాధ

కమలాపురం : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల మనో వికాసం పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈఓ అనురాధ తెలిపారు. గురువారం స్థానిక జడ్పీ బాయ్స్ హైస్కూల్‌లో ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. 8వ తరగతి, టెన్త్, ప్లస్–2 విద్యార్థులతో ముచ్చటించారు. వివిధ అంశాలతోపై విద్యార్థులను ప్రశ్నించారు. ప్రణాళికాబద్ధంగా చదివితే విజయం మీ బానిస అవుతుందని విద్యార్థులకు వివరించారు. ఏరోజు పాఠ్యాంశాలు ఆరోజు చదవాలని, అప్పుడే టాపర్లుగా నిలుస్తారని విద్యార్థులకు సూచించారు. పోటీ ప్రపంచంలో రాణించాలంటే పాటించాల్సిన నియమ నిబంధనల పట్ల దిశా నిర్దేశం చేశారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. సకాలంలో టెన్త్ సిలబస్ పూర్తి చేయాలన్నారు. జనవరి నుంచి రివిజన్ చేయాల్సి ఉంటుందన్నారు. ప్రతి రోజు స్లిప్ టెస్టులు నిర్వహించి విద్యార్థుల ప్రగతిని పెంచాలన్నారు. ముఖ్యంగా డల్ స్టూడెంట్లపై శ్రద్ధ చూపాలన్నారు. అలాగే విద్యార్థుల్లో చదువుతో పాటు మనో వికాసం, జీకే పెంచేందుకు ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలన్నారు. పాఠశాలలో ఎకో క్లబ్స్‌ను, న్యూట్రిషన్ గార్డన్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ప్రతి రోజు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. ఎంఈఓ–2 సుభాషిణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు


ఖాళీ ప్రదేశాల్లో మద్యం సీసాలు, వాటర్ బాటిళ్లను తొలగిస్తున్న ఎఎస్ ధనుంజయుడు

వేముల : మండల వ్యాప్తంగా ఎక్కడైనా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ధనుంజయుడు తెలిపారు. స్థానిక బస్టాండు సమీపంలోని ఖాళీ ప్రదేశంలో పేరుకుపోయిన మద్యం సీసాలు, వాటర్ ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లను, చెత్తాచెదారాలను అక్కడున్న వారితో తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇకపై మద్యం సేవించి ఖాళీ సీసాలు, వాటర్‌బాటిళ్లు ఇక్కడ వేస్తే వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. బంకులు, షాపులు, చికెన్ పకోడ బండ్ల వద్ద మద్యం సేవించవద్దన్నారు. అక్కడున్న దుకాణాదారులు మద్యం సేవించేవారిని అనుమతించవద్దన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించకుండా ప్రతి ఒక్కరు పరిశుభ్రతకు సహకరించాలని, మద్యం ప్రియులు ఈ నిబంధనలను తప్పక పాటించాలన్నారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ సుధాకర్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

వైవీయూ ఆర్ట్స్ విభాగ డీన్‌గా కంకణాల గంగయ్య

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయ ఆర్ట్స్ విభాగం డీన్‌గా చరిత్ర, పురావస్తు శాఖ ఆచార్యులు డాక్టర్ కంకణాల గంగయ్య నియమితులయ్యారు. నియామకపు పత్రాన్ని వైవీయూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డితో కలసి తన ఛాంబర్‌లో అందజేశారు. ఇప్పటి వరకు డీన్‌గా పనిచేసిన తెలుగు శాఖ ఆచార్యులు రామప్రసాదరెడ్డి పదవీకాలం పూర్తి కావడంతో నియామకం చేపట్టారు.

కలుపు మొక్కలతో రైతులకు ఇక్కట్లు


కలుపు మొక్కలను తొలగిస్తున్న కూలీలు

పులివెందుల రూరల్ : నియోజకవర్గంలోని రైతులు మొక్కజొన్న, పత్తి, మిరప, టమోట నాట్లు వేసే సమయంలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా మొలకలు రాక ఇబ్బందులు పడ్డారు. అయితే పంటలకంటే ముందుగా కలుపు మొక్కలు పెరిగిపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కొంత మంది రైతులు కలుపు మొక్కలను తొలగించడానికి గడ్డిమందులు పిచికారీ చేస్తుండగా మరికొంత మంది రైతులు కూలీలతో కలుపు మొక్కలను తొలగించే పనిలో పడ్డారు. గత ప్రభుత్వంలో రైతు భరోసా సమయానికి అందించేవారు. ప్రస్తుత ప్రభుత్వం రైతు భరోసా ఎప్పుడు వస్తుందోనని రైతులు ఎదురు చూస్తున్నారు.

పోష్ చట్టంపై మహిళలకు అవగాహన ఉండాలి


పోష్ చట్టంపై మాట్లాడుతున్న వేంపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో సునీత


లింగాల : సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ శ్రీలత

చక్రాయపేట : మహిళలపై జరుగుతున్న వేధింపులు, అత్యాచారాల నిరోధక చట్టం పోష్ యాక్ట్ 2013పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని వేంపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో సునీత తెలిపారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో పోష్ యాక్ట్ చట్టంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రతి మహిళ ఇంటి నుంచి బయలు దేరి ఏ ప్రాంతానికైతే పనికి వెళుతుందో ఆప్రాంతం అంతా ఈ చట్టం పరిధిలోకి వస్తుందన్నారు. ఇలాంటి వేధింపులపై ఫిర్యాదులు చేయడానికి ప్రతి కార్యాలయంలో ఇంటర్నల్ ఫిర్యాదుల కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. మండల స్థాయిలో తహసీల్దార్లు, మున్సిపాలిటీల్లో కమిషనర్‌లు నోడల్ అధికారిగా పనిచేస్తారన్నారు. మండల స్థాయిలో ఇంటర్నల్ కమిటీ ఇచ్చిన నివేదికపై జిల్లాస్థాయిలోని లోకల్ కమిటీకీ పంపి అక్కడ వారు విధించే శిక్ష అమలు అవుతుందన్నారు. ఆ శిక్షకు మహిళలు సమ్మతించక పోతే కోర్టుకు వెళ్లవచ్చునన్నారు. పోష్ యాక్ట్ ఫిర్యాదుల కోసం ప్రతి కార్యాలయంలో ఫిర్యాదుల పెట్టెను అధికారులు ఏర్పాటు చేయాలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో సోమశేఖర్, ఎస్ఐ వినోద్‌కుమార్, చక్రాయపేట వైద్యాధికారిణి వాణి, సీహెచ్‌వో వెంకటరామిరెడ్డి, ఏపీవో రవి, సూపర్‌వైజర్లు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ సహాయకులు, వెలుగు సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు

మహిళల పట్ల గౌరవంగా వ్యవహరించండి

లింగాల : మహిళా ఉద్యోగుల పట్ల ప్రతి ఉద్యోగి మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని ఎంపీడీఓ తేజోత్స్న తెలిపారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో మహిళా ఉద్యోగులపై లైంగిక వేధింపులు అన్న అంశంపై అవగాహన సదస్సును ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సద్సులో పాల్గొన్న ఎంపీడీవో మాట్లాడుతూ మహిళా ఉద్యోగులపై లైంగిక వేధింపులు పోష్ 2013 యాక్ట్ నిరోధక చట్టంపై అవగాహన కల్పించారు. మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులను నివారించేందుకు పోష్ యాక్ట్ చట్టాన్ని 2013 ఏప్రిల్ 23న కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ శ్రీలత, డిప్యూటీ తహసీల్దార్ త్రిభువన్‌రెడ్డి, ఏఓ లోకేశ్వరరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

రేపటివరకు శిశు ఆధార్ కేంద్రం ఉంటుంది


అంగన్‌వాడీ కేంద్రంలో ఆధార్ తీస్తున్న సిబ్బంది

జమ్మలమడుగు : కన్నెలూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఉచిత శిశు ఆధార్ కేంద్రం 27వ తేదీ వరకు ఉంటుందని ఐసీడీఎస్ అధికారిణి రాజేశ్వరి తెలిపారు. ఈనెల 27వ తేదీ వరకు మాత్రమే పుట్టిన పిల్లలకు ఆధార్ తీయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆలయ నూతన కమిటీ ఎన్నిక

కమలాపురం : మండల పరిధిలోని టి.చదిపిరాళ్లలో వెలసిన అగస్త్యేశ్వరస్వామి దేవస్థానం, వేణుగోపాలస్వామి, మంచాలమ్మ ఆలయాల నూతన కమిటీ ప్రమాణ స్వీకారం చేశారు. గురువారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ కమిటీ చైర్మన్‌గా చంద్రశేఖర్‌రెడ్డి, కమిటీ సభ్యులుగా నారాయణరెడ్డి, హనుమంతరెడ్డి, నారాయణచారి, ఓబయ్య, సుబ్బలక్షుమ్మలను ఈఓ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణం చేయించారు.

అప్రమత్తతే బాలికలకు రక్షణ

వైవీయూ: విద్యార్థినిలు వ్యక్తిగత విషయాల పట్ల గోప్యతను పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని వైవీయూ పీజీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య పుత్తా పద్మ అన్నారు. జాతీయసేవా పథకం యూనిట్–7, 4 ప్రోగ్రాం ఆఫీసర్లు డా. ఎస్. లలిత, సునీత, మైనార్టీ సెల్ డైరెక్టర్ డైరెక్టర్, రియాజున్నీసా ఆధ్వర్యంలో ×మహిళా రక్షణ చైతన్య సదస్సు విశ్వవిద్యాలయంలోని సెమినార్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య పద్మా మాట్లాడుతూ క్యాంపస్‌లో, ఇక్కడ సమస్య వచ్చిన వెంటనే ఉమెన్ సెల్ దృష్టికి తీసుకురావాలని సూచించారు. విశిష్ట అతిథి, సఖి వన్ స్టాప్ సెంటర్ కౌన్సిలర్ కే. సునీత మాట్లాడుతూ బాలికలకు, మహిళలకు ఉన్న చట్టాలు, పోక్సో చట్టం గురించి అవగాహన కల్పించారు. సమస్య వచ్చినప్పుడు హెల్ప్ లైన్ నెంబర్ (1811120098) ను సంప్రదించాలన్నారు.

31న వేలంపాట

కడప అర్బన్: కడపలోని జిల్లా కోర్టు ప్రాంగణంలో వాడుకలో లేని పాత ఫర్నీచర్, చెక్క వస్తువులు, ఇతరత్రాలు ఈనెల 31న మధ్యాహ్నం వేలం వేయనున్నారు. ఈ విషయం కడపలోని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కార్యాలయం చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ టి.వి.ఎం కృష్ణారావు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

రక్తదానం మరొకరి జీవితానికి వెలుగు


రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లను అందజేస్తున్న ఎంపీడీఓ సంపతి దివజా

వేంపల్లె : రక్తదానం మరొకరి జీవితానికి వెలుగును ఇస్తుందని ఎంపీడీఓ సంపతి దివజా తెలిపారు. రక్తదాన వారోత్సవాల్లో భాగంగా గురువారం నెహ్రూ యువ కేంద్రం సహకారంతో గంగా రూరల్ ఎన్విరాన్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ రక్తదాన శిబిరంలో 35 మంది విద్యార్థులు, పాలిటెక్నిక్ ఉద్యోగులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ రక్తదానం చేయండి–ప్రాణదాతలు అవ్వండి అని ఎన్నో స్వచ్ఛందం సంస్థలు, వైద్యులు పలు అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు చేయడం సంతోషకరమన్నారు. 3 నెలలకు ఒకసారి రక్తదానం చేయడం వల్ల ఆరోగ్యంగా ఉండటంతో పాటు ప్రమాదకర పరిస్థితుల్లో మరొకరికి ప్రాణదానం చేసినవారవుతారన్నారు. గంగా రూరల్ ఎన్విరాన్మెంట్ సొసైటీ అధ్యక్షుడు శివకృష్ణ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులతో పాటు ప్రతి ఒక్కరు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి, వెటర్నరీ డాక్టర్ సాదిక్‌బాషా, మదర్‌థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విజయ్‌కుమార్, రెడ్‌క్రాస్ స్పెషల్ ఆఫీసర్ శివశంకర్, స్నేహిత అమృతహస్తం చైర్మన్ రాజు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ హేమంత్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం


ఆత్మీయంగా కలుసుకున్న 1972 పూర్వ విద్యార్థులు

పెండ్లిమర్రి : వెల్లటూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1972 బ్యాచ్ పూర్వ విద్యార్థులు గురువారం కలుసుకున్నారు. హైస్కూల్‌కు వెళ్లి సంతోషంగా అభినందలు తెలువుకుంటూ ఒకరినొకరి యోగక్షేమాలు తెలుసుకుని ఆనందంగా గడిపారు. వెల్లటూరు చెన్నకేశవస్వామి గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయులు, విద్యార్థులకు స్వీట్లు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో వెల్లటూరు జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్‌ఎం శ్రీనువాసులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర క్యాబ్ డ్రైవర్లను మున్సిపాలిటీలోకి తీసుకోవాలి


మాట్లాడుతున్న యూనియన్ నాయకులు విజయకుమార్, సాల్మన్

ప్రొద్దుటూరు : స్వచ్ఛాంధ్ర క్యాబ్ డ్రైవర్లను మున్సిపాలిటీలోకి తీసుకోవాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) పట్టణ ప్రధాన కార్యదర్శి సాల్మన్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో స్వచ్ఛాంధ్ర క్యాబ్ డ్రైవర్లుగా పని చేస్తున్న 35 మంది సీఐటీయూలో చేరారు. ఈ సందర్భంగా 9 మందితో నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. స్వచ్ఛాంధ్ర క్యాబ్ డ్రైవర్ల పట్టణ కమిటీ నూతన అధ్యక్షుడిగా జూటూరు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా రాయచోటి పవన్‌కుమార్, కోశాధికారిగా గజ్జల రాజకుమార్, ఉపాధ్యక్షులుగా ఇల్లూరు మహేష్ బాబు, ఎన్.సుబ్బరాయుడు, గాలిపోతుల విజయరాజు, సహాయ కార్యదర్శులుగా మేకల మదన్, కొత్తపల్లి కిరణ్‌కుమార్, కాసుల తరుణ్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయకుమార్, పట్టణ ప్రధాన కార్యదర్శి సాల్మన్, కోశాధికారి రాఘవేంద్ర మాట్లాడుతూ క్యాబ్ డ్రైవర్లకు మున్సిపాలిటీలో ఇచ్చే డ్రైవర్లకు మాదిరిగానే జీఓ నంబర్ 39 ప్రకారం వేతనం రూ.24,500 ఇవ్వాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పీఎఫ్, ఈఎస్ఐ, వేతనాలను వెంటనే చెల్లించాలని పేర్కొన్నారు. కొబ్బరి నూనె, సబ్బులు, చెప్పులు, యూనిఫాం ఇవ్వాలన్నారు.